క్లుప్తంగా

సర్వే త్వరగా పూర్తి చేయండి

మునిపల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ హరినందన్‌రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే సర్వే ఆలస్యమైందని జిల్లా అధికారుల నుంచి వత్తిడి వస్తుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 10,954 మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 82.47 శాతం సర్వే చేసినట్లు తెలిపారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రమణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓఆర్ఆర్30 ఎక్స్‌టేషన్ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ఓఆర్ఆర్30 ఎక్స్‌టేషన్ రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో స్థానికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందులో భాగంగా మంత్రిని కలిసి సమస్యను వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

పకడ్బందీగా జాతర ఏర్పాట్లు

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్


నిర్వాహకులతో మాట్లాడుతున్న కుమార్

పటాన్‌చెరు టౌన్: జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలోని బండల మల్లన్నస్వామి జాతర జనవరి 4, 5 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వెంకటయ్య

నారాయణఖేడ్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఖేడ్‌లో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ వెంకటయ్య మాట్లాడుతూ..హెల్మెట్, సీటుబెల్టు ధరించడం, లైసెన్సు, బీమా కలిగిఉండే ఆవశ్యకతను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న రవికిరణ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు బీఆర్ఎస్ నాయకులు గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ నామరవికిరణ్, మాజీ పార్టీ అధ్యక్షుడు యాకూబ్ తదితరులు రూ. 1.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అల్లీపూర్ నేతాజీ నగర్‌కు చెందిన ఫాతిమాకు రూ. 60 వేలు, ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన అఫ్రిన్ బేగంకు రూ. 52 వేలు, సుభాష్‌గంజ్‌కు చెందిన ఇంతియాస్‌కు రూ. 18 వేల చెక్కులను అందజేశారు.

6న పుణ్యతిథి

నారాయణఖేడ్: ఖేడ్ మండలం లింగాపూర్‌లో ఈనెల 6న కృష్ణదేశిక స్వాములవారి 95వ పుణ్యతిథి మహోత్సవాన్ని విఠల్‌దాస్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్వామివారికి అభిషేకం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజన, నారాయణదాస్ గారిచే హరి కథా కాలక్షేపం, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

భరించలేని దుర్వాసన


- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


చెక్‌డ్యాంలో నిండిపోయి పారుతున్న వ్యర్థజలం

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనంతో రహదారి వెంట రాకపోకలు సాగించే వాహనదారుల ముక్కుపుటలు అదిరే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ శివారులో నిర్మించిన చెక్‌డ్యాంలో పూర్తిగా మురికినీరు చేరి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. మండల కేంద్రం ఝరాసంగం నుంచి బోప్పన్‌పల్లి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న చెక్‌డ్యాం నీరు నిలిచి కంపు కొడుతుంది. ఝరాసంగంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల విద్యాలయం నుంచి వృథా నీరు, డ్రైనేజీ నీటిని వదలడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని అటు వైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ఝరాసంగం నుంచి వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామ శివారులోని పంట పొలాలకు పనులపై రైతులు, కూలీలు వెళ్తుంటారు. గతంలో వాగులో ఉన్న నీటిని పరిసర ప్రాంత రైతులు పంట పొలాలకు వినియోగించేవారు. ప్రస్తుతం పొలం పనులు నిర్వహిస్తున్న సమయంలో అనేక రకాల ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు వైపుగా రాకపోకలు సాగించే వారు పాఠశాల ఆవరణ వద్దకు రాగానే ముక్కు మూసుకుని పోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో దుర్వాసన మరింత ఎక్కువగా వస్తుందని తెలిపారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని పాఠశాల నుంచి చెక్‌డ్యాంలోకి వ్యర్థజలాలు వదలకుండా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సిద్ధివినాయక జయంత్యుత్సవాలు


యజ్ఞాల్లో పాల్గొన్న దంపతులు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామశివారులో గల సిద్ధివినాయక ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు కొనసాగుతున్నాయి. మూడవ రోజు గురువారం స్వామివారికి అభిషేకం, గణపతి హవనములు, శతచండీ హవనములు, పూర్ణాహుతి, మహామంగళ హారతి, తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. ఆలయం ఆవరణలో దంపతులు యజ్ఞాలు నిర్వహించారు. వినాయక నామస్మరణతో యజ్ఞశాల మార్మోగింది. ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ట్రస్టు సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్, బర్ధీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి శ్రీ అవదూతగిరి మహరాజ్ తదితరులు హాజరయ్యారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించి యజ్ఞాల్లో పాల్గొన్నారు. వారి వెంట బీజేపీ నాయకులు ఓంకార్, మల్లేశ్ గంగ్వార్, విష్ణు, కాశీనాథ్, జగనాథ్ తదితరులు ఉన్నారు.

ప్రత్యామ్నాయ రహదారిని ఎంచుకోండి

సీఐ స్వామిగౌడ్



పటాన్‌చెరు: వాహనదారులు ప్రత్యామ్నాయ రహదారిని ఎంచుకోవాలని బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి 5 తేదీ వరకు రంగారెడ్డి జిల్లా.. శంకరపల్లిలో ఇజ్తెమా కార్యక్రమం నేపథ్యంలో పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వైపు వెళ్లే రహదారి రద్దీగా ఉంటుందని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ రహదారికి ఆనుకొని ఉన్న చుట్టుపక్కల గ్రామాల ప్రజల, పాఠశాలల, కళాశాలలకు చెందిన బస్సులు, పరిశ్రమలకు చెందిన వాహనాలు, ఇతర వాహనాల చోదకులు ప్రత్యామ్నాయ రహ దారిని ఎంచుకోవాలని సూచించారు. కార్ధనూర్ చౌరస్తా నుంచి ముత్తంగి, కంది మీదుగా చేవెళ్ల, వికారాబాద్ వైపు వెళ్లే రహదారి గుండా వెళ్లాలని సూచించారు.

ఘనంగా బీహెచ్ఈఎల్ డే


జెండాను ఎగురవేస్తున్న ఈడీ రాజా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ దినోత్సవాన్ని భెల్ యాజమాన్యం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో భెల్ ఈడీ కేబీరాజా, ఈడీ పీఈఅండ్ఎస్‌డీ శ్రీనివాస్ రావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కార్మికులతో పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

హరీశ్‌రావుకు శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

పటాన్‌చెరు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుని గురువారం పటాన్‌చెరు బీఆర్ఎస్ నేత పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో యువకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధు, ప్రవీణ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ విక్రయిస్తే చర్యలు

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఫసల్వాదిలో ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను విక్రయించినా, కొనుగోలు చేసిన చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దేవదాసు హెచ్చరించారు. గురువారం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2023లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించిందన్నారు. కొందరు విక్రయించినట్లు తమ దృష్టికి వచ్చిందని, పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు.

శబరిమలకు తరలిన మాలధారులు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో గురువారం అయ్యప్పస్వాములు శబరిమలకు తరలివెళ్లారు. అంతకుముందు దీక్షదారులు ప్రత్యేకంగా పూజలు చేశారు. ఇరుముడి కట్టుకుని ఊరేగింపుగా బయలుదేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, మాలధారులు యాదవరావు, కిరణ్‌రావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో ఉజ్వల భవిష్యత్


ఎన్‌సీసీ విద్యార్థులతో బాలపరమేశ్వర్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం ఉన్నతాధికారి, మహీంద్ర అకాడమీ స్కూల్ కరస్పాండెంట్ ఎస్.బాలపరమేశ్వర్‌రావు అన్నారు. కంది ఐఐటీలో 33 తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు క్యాడెట్లకు సీఏటీసీ 8 ఎన్‌సీసీ శిక్షణా శిబిరం నిర్వహించారు. మహీంద్ర అకాడమీ స్కూల్‌కు చెందిన 24 మంది ఎన్‌సీసీ విద్యార్థులు శిక్షణ పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాడెంట్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులో ఎన్‌సీసీ శిక్షణ పొందడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశం జీవితంలో ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్యాడెట్లు శిక్షణ తరగతులు విజయవంతం చేసినందుకు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా తాళ్లూరి, పరిపాలన అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సీటీఓ సలోమి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి


శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వట్‌పల్లి(అందోల్): పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దేవునూర్ గ్రామంలో సాగవుతున్న శనగ, కుసుమ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకం ద్వారా భూసారం తగ్గి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. విరివిరిగా సేంద్రియ ఎరువులను వాడుకోవాలన్నారు. పంటలో వచ్చే తెగులు, పచ్చ పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సాగు సమయంలో విత్తన శుద్ధి ద్వారా భూమిలో ఉన్న వ్యాధికారక శిలీంధ్రాలను నశింపజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ ప్రవీణ్ ఉన్నారు.

నూతన నియామకం


అనిల్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్ టౌన్: పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జహీరాబాద్ పట్టణానికి చెందిన సోమఅనిల్ నియమితులయ్యారు. గురువారం సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో నూతన కమిటీలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ మేరకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. సోమ అనిల్ మాట్లాడుతూ.. యువజన రాష్ట్ర కమిటీలో తనకు స్థానం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఇతర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



సదాశివపేట(సంగారెడ్డి): టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ గురువారం మండల వనరుల కేంద్రం ఆవరణలో ఎంఈఓ శంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, పట్టణ మండల అధ్యక్షులు శంకర్, వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సంజీవ్, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు, కోశాధికారి దశరథ్, టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ వింగ్ నాయకులు మోసిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకనే అడ్డంకులు

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: బీఆర్ఎస్ నాయకులు రియల్‌ఎస్టేట్ వసూళ్లకు పాల్పడి నేడు జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లిటిగేషన్ ఉన్న భూములను పోలీసులతో భయభ్రాంతులకు గురిచేసి కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు భూములు ఫార్మ్‌ల్యాండ్స్‌పేర రిజిస్ట్రేషన్లు చేయించి మోసం చేశారని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఒకనాడు ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డొక్కు స్కూటర్‌పై పెట్రోల్ తిరిగేవాడని విమర్శించారు. మార్కెట్ కమిటీ పదవిని రూ.13లక్షలకు అమ్ముకున్నాడని, అతని సతీమణి పేర వాహనం కొనుగోలు చేసిన విషయం నియోజకవర్గ ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. నేడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుతున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యం పదేళ్ల కాలంలో నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టినా ఆరేళ్లయిన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చాక పేద రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పించినట్లు గుర్తు చేశారు. వెంచర్లకు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు వేసుకున్న ఘనత బీఆర్ఎస్ నాయకులదన్నారు. తాము ఏ పనులను రద్దు చేయించలేదని తెలిపారు. ఆయా శాఖల వారీగా మంజూరైన నిధులు, పనులను వివరించారు. అభివృద్ధిని అడ్డుకుని రాజకీయ లబ్ధిపొందాలని యత్నిస్తే ప్రజలు తగిన విధంగా బుద్ధిచెబు తారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రమేష్ చౌహాన్, వినోద్‌పాటిల్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల 40వ వార్షికోత్సవం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జహీరాబాద్ టౌన్: దివ్యాంగుడైన విద్యావంతుడు వెంకటయ్య పట్టణంలో స్థాపించిన మాణిక్‌ప్రభు పాఠశాలలో గురువారం 40 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ట్రస్మా కమిటీ సభ్యులు, విద్యావంతులు పాల్గొని పాఠశాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వ్యవస్థాపకులు వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అంగవైకల్యం ఉన్న వెంకటయ్య పట్టణంలోని మురికివాడలో పాఠశాలను స్థాపించి ఎంతో మందికి విద్యాదానం చేశారని కొనియాడారు. ఎన్ని కష్టాలు ఎదురైన ఆత్మవిశ్వాసంతో అంచలంచెలుగా పాఠశాలను అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఎంపల్లి మల్లికార్జున్, కార్యదర్శి కొత్తకాపు సుభాష్‌రెడ్డి, ట్రస్మా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణరెడ్డి, మోహన్‌రెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యావంతులు బెండి రాచప్ప, కొలాస్ మహదేవ్, నాగన్న పంతులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యంపై క్విజ్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): పాతపంటల జాతరను పురస్కరించుకుని విద్యార్థులకు డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జీవవైవిధ్యంపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. గురువారం మండలంలోని మాచ్నూర్ గ్రామ శివారులోని డీడీఎస్ సంఘం రేడియో స్టేషన్ ఆవరణలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చిరుధాన్యాల సాగుపై అవగాహన కలిగి ఉండేందుకు పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోటీల్లో నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, జహీరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రశ్నలు, విత్తనాల రౌండ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో మొదటి బహుమతి జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్‌లోని హర్షిత, అమూల్య, రిష్వంత్ రెడ్డి, అరుణ్, రెండో బహుమతి న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు శేషు, శృత, కృష్ణవేణి, గణేష్, మూడవ బహుమతి ఝరాసంగంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు నరేష్, అజయ్‌భానుగౌడ్, శ్రీవల్లి, రాధిక గెలుపొందారు. విద్యార్థులకు పాతపంటల జాతర ముగింపులో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

భూములు పంపిణీ చేయాలని ర్యాలీ


రైతులను ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామస్తులు సీపీఐ నాయకులతో కలిసి గురువారం ఆందోళనకు దిగారు. కొన్ని రోజులుగా స్థానికంగా ఉన్న కస్టోడియన్ భూములను పేద ప్రజలకు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు రైతులతో కలిసి పోరాటం చేస్తున్నారు. మెదక్ జిల్లా సీపీఐ కార్యదర్శి కాలిక్ దాదాపు 500 మంది గ్రామస్తులతో ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. సీఐ నయీముద్దీన్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, సీపీఐ నాయకులను రైతులను మరో స్టేషన్‌కు తరలించి పరిస్థితిని చక్కదిద్దారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలి


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రైతులు

సంగారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధరలు ప్రకటించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వింటాల్ వరికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5300 కనీస మద్దతు ఇస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ వరికి కేవలం రూ. 2300 నిర్ణయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలపై గ్రామాల్లో ఫ్లెక్సీలు వేసి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రమౌళి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత


ఖయ్యూంకు ఆటో అందజేస్తున్న రజిత

హుస్నాబాద్: మహిళలు, యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. ముద్ర లోన్ కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి మంజూరైన ఆటోను పట్టణంలోని 15వ వార్డుకు చెందిన ఒక మహిళ సభ్యురాలి భర్తకు మహమ్మద్ ఖయ్యూంకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ పథకం ద్వారా క్యాంటీన్ నిర్వహణ కోసం మెప్మాకు చెందిన భవానీ స్వయం సహాయక సంఘ సభ్యులకు బ్యాంక్ ద్వారా రూ.11 లక్షలు మంజూరు చేశామన్నారు. వ్యాపార నిమిత్తం స్త్రీనిధి, ముద్ర, పీఎం ఈజీపీ ఇలా పలు పథకాల ద్వారా రుణం తీసుకునే అవకాశం మహిళలకు ఉందన్నారు. ప్రతీ ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ప్రణీత్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మెప్మా టీఎంసీ ముత్యాల రాజు పాల్గొన్నారు.